అమ్మలకే అన్ని బాధ్యతలు!



- ప్రభుత్వ పాఠశాలల్లో చకచకా 'అమ్మ ఆదర్శ కమిటీ'పనులు
- కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేయడమే లక్ష్యం
- ఇప్పటికే ఖాతాల్లోకి మొదటి విడత నగదు

సనత్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చాలనే లక్ష్యంగా స్వయం సహాయక మహిళలను భాగస్వామ్యం చేస్తూ ఏర్పాటైన 'అమ్మ ఆదర్శ కమిటీ'ల పని తీరు మొదలైంది. సనత్‌నగర్ నియోజకవర్గం లోని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధి కిందికి వచ్చే సనత్‌నగర్ ప్రాంతంలోని పలు పాఠశాలలతో పాటు సికింద్రాబాద్ మండల పరిధి కిందికి వచ్చే బేగంపేట, రాంగోపాల్ పేట్, బన్సీలాల్‌పేట, మోండా డివిజన్‌లలోని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. గతంలో మనబస్తీ–మన బడి కార్యక్రమం కింద ఎంపిక కాని పాఠశాలలను ప్రధానంగా అమ్మ ఆదర్శ కమిటీల కిందికి తీసుకువచ్చి వాటి ద్వారా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు అభివృద్ధి చేసే బాధ్యతలను కమిటీలోని మహిళలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులకే అప్పగించారు.



నల్లగుట్ట ఓల్డ్ ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల పనులు చేపడుతున్న దృశ్యం

ఖర్చులు ఇలా..

మంచినీటి సౌకర్యానికి రూ. లక్ష,
చిన్న చిన్న మరమ్మతులకు రూ.2 లక్షలు
విద్యుత్ పనులకు రూ.25 వేలు
బాలికల మరుగుదొడ్ల మరమ్మతులకు రూ.3.50 లక్షలు

ప్రణాళికలతో పనులపై ఖర్చులు..

సర్కిల్ టౌన్ లెవల్ ఫెడరేషన్ (టీఎల్ఎఫ్) అధ్యక్షురాలు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా, పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా ఉంటారు. కమిటీ చైర్మన్‌తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడి పేర్లతో బ్యాంకుల్లో జాయింట్ అకౌంట్లు కూడా తెరిచారు. అభివృద్ధి పనులు చేపట్టే క్రమంలో ఇప్పటికే మొదటి విడతగా పలు పాఠశాలలకు రూ.40 వేలు ఖాతాలో జమ అయ్యాయి. దీంతో సనత్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో సర్కార్ బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. కొత్త విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం అవుతుండగా, ఆ లోపు అంటే జూన్ 10 వరకు పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే పాఠశాలల్లో ఏయే పనులు చేయాలో ఒక నివేదికను రూపొందించారు. నిధులు దుర్వినియోగం కాకుండా ఉండేలా మండల నోడల్ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సర్వే నిర్వహించి దేనికెంత ఖర్చు చేయాలో ప్రణాళికలు రూపొందించారు. ఆ మేరకు సదరు కమిటీలు దగ్గరుండి పనుల పర్యవేక్షణ జరపనున్నాయి.

ఇవి బాధ్యతలు..

పాఠశాలల పర్యవేక్షణ, బలోపేతం చేయడం, తాగునీటి సౌకర్యాలు, మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణం, పాతవి పునరుద్ధరణ, తరగతి గదుల విద్యుద్దీకరణ, కుర్చీలు, బెంచీలు, పాఠశాల ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ బిల్లులు తగ్గించేందుకు సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, విద్యార్థుల యూనిఫామ్‌లు, ఉచిత పాఠ్య పుస్తకాలు తదితర అంశాలకు సంబంధించిన బాధ్యతలను కమిటీలు చూసుకుంటాయి. అలాగే ఇతరత్రా మరమ్మతు పనులపై దృష్టి సారించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే సంబంధిత అమ్మ ఆదర్శ కమిటీలతో పాఠశాలల ఉపాధ్యాయులు సమావేశాలను నిర్వహించారు. యుద్ధ ప్రాతిపదికన ఏ పనులు ముందు చేపట్టాలో వాటి వివరాలపై కూడా చర్చించారు. వచ్చే నెల 10 లోపు సాధ్యమైనన్ని పనులు పూర్తిచేసి బడుల్లో సమస్యలు లేకుండా చూడాలని యోచిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచే విషయంపై కూడా దృష్టి సారించనున్నారు.

నాగులూరి పార్కులో అభివృద్ధి పనులకు శ్రీకారం



పార్కులో పనులు ప్రారంభిస్తున్న సాయిబాబా

చిలకలగూడ: చిలకలగూడ జీహెచ్ఎంసీ నాగులూరి పార్కులో పలు అభివృద్ధి పనులను నాగులూరి నర్సింహా వెల్ఫేర్ అసోషియేషన్ చైర్మన్ నాగులూరి సాయిబాబా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా పార్కును దత్తత తీసుకుని నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. లక్షలాది రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మరమ్మతులతో పాటు నూతనంగా మరికొన్ని కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, భూగర్భజలాలను పరిరక్షించేందుకు ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నామన్నారు. పార్కులో మొక్కలను సంరక్షించి, పచ్చందాలను పెంపొందించేందుకు రెండు లారీల ఎర్రమట్టితో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. వాకర్స్, యోగా అభ్యాసకులతో త్వరలో సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని సాయిబాబా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ ప్రతినిధులు తుమ్మ శ్రీను, రాధకృష్ణశర్మ, సతీష్, ఆంజనేయులు, ప్రమోద్, రవిశంకర్ పాల్గొన్నారు.

నేడు జీవ వైవిధ్య దినోత్సవం

టీజీపీసీబీలో పెయింటింగ్ పోటీలు

సనత్‌నగర్: అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సనత్‌నగర్‌లోని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) కార్యాలయంలో పాఠశాల విద్యార్థులకు పెయింటింగ్ కాంపిటీషన్ నిర్వహించనున్నట్లు సీనియర్ సోషల్ సైంటిస్ట్ ప్రసన్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బోర్డు ఆడిటోరియంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మూడు విభాగాలుగా విభజించి ఈ పోటీలు జరుగుతాయన్నారు.

- అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) సందర్భంగా టీజీపీసీబీ పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రసన్నకుమార్ తెలిపారు. మే 29న పీసీబీ ఆడిటోరియంలో పర్యావరణ అంశంపై స్కిట్స్ పోటీలు, 30న గ్రూప్ డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. బుధవారం జరిగే జీవ వైవిధ్య దినోత్సవం పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 29, 30 తేదీల్లో జరిగే పోటీల్లో కూడా పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు.

డాక్టరేట్ ప్రదానం



ఉదయ్‌కుమార్

లాలాపేట: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మీసాల ఉదయ్‌కుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డి డాక్టరేట్‌ను ప్రకటించింది. ఓయూ తెలుగు శాఖ రిటైర్డు ప్రొఫెసర్ ఆచార్య వెలుదండ నిత్యానందరావు పర్యవేక్షణలో 'పెద్దింటి అశోక్ కుమార్ నవలలు, సమగ్ర పరిశీలన' అనే అంశంపై సమగ్రమైన పరిశోధన గ్రంథాన్ని సమర్పించడంతో యూనివర్సిటీ డాక్టరేట్‌తో సత్కరించింది.

పూర్తిస్థాయి వీసీలను నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో పది వర్సిటీలకు ఇన్‌చార్జిలను కాకుండా పూర్తిస్థాయి వీసీలను నియమించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్ మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిత్యం విధినిర్వహణలో బిజీగా ఉండే ఐఏఎస్‌లను ఇన్‌చార్జిలుగా నియమించడంతో వర్సిటీల పాలన వ్యవస్థ కుంటుపడుతుందన్నారు.

టీ -సేవా కేంద్రాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: స్వయం ఉపాధి పొందేందుకు టీ–సేవ ఆన్‌లైన్ కేంద్రాల ఏర్పాటుకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ అడపా వెంకటరెడ్డి తెలిపారు. టీ–సేవ ఆన్‌లైన్ ద్వారా వివిధ బిల్లుల చెల్లింపులు, పాన్‌కార్డు సేవలు, బస్సు, ట్రైన్, విమాన టికెట్ల బుకింగ్స్, ఆల్ బ్యాంక్ మనీ ట్రాన్స్‌ఫర్లు, ఆధార్ ఆధారిత పేమెంట్ సిస్టం, వినియోగదారులకు మైక్రో ఏటీఎం సహా తదితర సేవలను అందించడం ద్వారా అభ్యర్థులు స్వయం ఉపాధి పొందవచ్చని సూచించారు. ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 8179955744.

జూన్ 9 వరకు జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన



ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న వస్త్ర ప్రదర్శన

కవాడిగూడ: ఎన్టీఆర్ స్టేడియంలో కొసాగుతున్న జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన జూన్ 9 వరకు కొసాగనున్నట్లు అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు దేవకీదేవి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఎన్టీఆర్ స్టేడియంలో ఆమె మాట్లాడుతూ... ఏప్రిల్ 13న ప్రారంభమైన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన ఈనెల 26తోనే ముగియనుండగా.. నగరంలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం జూన్ 9 వరకు పొడిగించిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న చేనేత, చేతి వృత్తుల వారు తయారు చేసిన వస్తువులు, వస్త్రాలు నగర ప్రజలకు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో ఈ ప్రదర్శనను నగర ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

అధ్యాపకులనే రెగ్యులర్ వీసీలుగా నియమించాలి

ముషీరాబాద్: రాష్ట్రంలోని పది యూనివర్సిటీల వీసీల పదవీకాలం ముగిసినందున తక్షణమే రెగ్యులర్ వీసీలను నియమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం శ్యామ్ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జి వీసీలుగా నియమించడం సరికాదని, తక్షణమే అధ్యాపకులతో పూర్తిస్థాయి వీసీలను నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలకు ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జ్ వీసీలుగా నియమించడంతో యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కుంటుపడుతుందని తెలిపారు. ఐఏఎస్ అధికారులు ప్రభుత్వ పాలనలో అనేక బాధ్యతలు నిర్వర్తిస్తూ.. ఇతర సమస్యలపై వారు సమయం కేటాయించలేరని తెలిపారు. గతంలో ఇన్‌చార్జి వీసీగా ఉన్న అరవింద్‌కుమార్ విషయంలో ఇదే జరిగిందని గుర్తు చేశారు. వీసీల పదవీకాలం ముగుస్తుందని ప్రభుత్వానికి స్పష్టంగా తెలిసినప్పటికీ ఆ నియామక ప్రక్రియను వేగవంతం చేయకుండా ఇన్‌చార్జి వీసీలను నియమించడమంటే కాలయాపన చేయడమేనన్నారు. తక్షణమే పూర్తిస్థాయి వీసీలను అక్కడ పనిచేసే అధ్యాపకులతో నియమించాలని కోరారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు



సనత్‌నగర్: బేగంపేట, ఈఎస్ఐ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ప్రశాంత్‌కాలనీ, బల్కంపేట్, బీకే గూడ మసీదు, ఈఎస్ఐ స్టాఫ్ క్వార్టర్స్, మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు డీకేరోడ్డు, రోశయ్య లేన్, శివబాగ్‌కాలనీ, మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు లీలానగర్, విద్యుత్ టవర్, రైల్వే ట్రాక్ ఏరియా, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాపూనగర్, జస్టిస్ రమణ నివాస లేన్, అప్పర్ వాటర్ ట్యాంక్, ఆంధ్రాబ్యాంక్ లేన్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా రూ.23, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 53, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 15, క్యారెట్ 40, దొండ 28, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 70, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 23, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 23, ఆలుగడ్డ 32, చామగడ్డ 43, మొరంగడ్డ 28, కందగడ్డ 70, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 8, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యులు

అమీర్‌పేట: పొగాకు ఉత్పత్తులను సేవించడంతో ప్రతి ఎనిమిది క్షణాలకు ఒకరు మృత్యువాత పడుతున్నారని శ్రీ సాయి ఓరల్ హెల్త్ ఛారిటబుల్ ట్రస్ట్, గాంధీ ఆసుపత్రి మాజీ ఆర్ఎంఓ డాక్టర్ నాగేశ్వర్‌రావు తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పొగాకు ఉత్పత్తులు సేవించడం వల్ల కలిగే అనార్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రతియేట 10 లక్షల మందికిపైగా పొగాకు ఉత్పత్తుల కారణంగా నోటి కేన్సర్ బారిన పడుతున్నారని పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు.

మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడి రిమాండ్

అడ్డగుట్ట: మాయమాటలు చెప్పి మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఓ వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. అడ్డగుట్టకు చెందిన ఓ మైనర్ బాలిక(16) ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడుతుందని తల్లిదండ్రులు మందలించడంతో ఈ నెల 19న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. ఈ క్రమంలో తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తిరుగుతున్న సదరు బాలికను సందీప్ రెడ్డి(28) ర్యాపిడో డ్రైవర్ బాలికతో మాటలు కలిపాడు. అనంతరం మాయమాటలు చెప్పి తన బైక్ ఎక్కించుకొని ట్యాంక్ బండ్, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో తిప్పి సాయంత్రానికి కాచిగూడలోని ఓ లాడ్జికి తీసుకెళ్లాడు. అనంతరం, బాలికపై అత్యాచారానికి పాల్పడి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇంటికి చేరుకున్న కూతురి ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా మంగళవారం సందీప్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ మృతి

రాంగోపాల్‌పేట్: అనుమానాస్పద స్థితిలో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఐడీపీఎల్ గాంధీనగర్ చెందిన సోమ నర్సయ్యకు(53) భార్య రేణుక, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత కొన్నేళ్ల క్రితం మోత్కూరు నుంచి నగరానికి వచ్చి నర్సయ్య ఆటో నడిపిస్తుండగా భార్య ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇదే ప్రాంతానికి చెందిన వ్యక్తి దగ్గర ఆటో అద్దెకు తీసుకుని ఉదయం నుంచి రాత్రి వరకు ఆటో నడిపిస్తూ రాత్రి తిరిగి ఇంటికి వెళుతుంటాడు. సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన ఆయన రాత్రైనా రాకపోవడం, ఫోన్ కూడా లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయన కోసం ఆరా తీస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం రెజిమెంటల్‌బజార్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ ప్రాంతంలోని ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి ఉన్నాడని స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఆటో నంబర్ సహాయంతో నర్సయ్యగా గుర్తించారు.

ఒంటిపై గాయాలు?



మృతి చెందిన సోమ నర్సయ్య

నర్సయ్య ముఖం, చేతులు, కాళ్లు పొట్టపై గాయాలున్నాయి. ఎవరితో అయినా గొడవ పడటంతో కొట్టారా.. మరేదైనా ప్రమాదం జరిగిందా అనేది స్పష్టత రాలేదు. ఎక్కడైనా ఏదైనా జరిగితే చనిపోయిన తర్వాత ఎవరైనా ఇక్కడ పడేసి వెళ్లారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆటో కూడా మృతదేహం పక్కనే తాళం వేసి కీస్ కూడా ఆటోలోనే లభించాయి. గాయాలు కూడా వాడిపోయి ఉండటంతో రాత్రి సమయంలోనే ఏదో జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

3 కిలోల కణితి తొలగింపు



పెంటయ్య మెడ కింద కణితి

అమీర్‌పేట: మెడ కింది భాగంలో ఏర్పడ్డ కణితితో 15 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న ఓ వృద్ధుడికి అమీర్‌పేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స చేసి తొలగించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ రహూఫ్ వివరాలు వెల్లడించారు. ఈసీఐఎల్‌కు చెందిన పెంటయ్య (60) మెడ కింది భాగంలో కణితి ఏర్పడటంతో వివిధ ఆసుపత్రులకు తిరిగి రూ.3 లక్షల వరకు ఖర్చు చేసుకున్నాడు.గుండె సంబంధిత సమస్యలు కూడా ఉండటంతో ప్రమాదం ఉంటుందని శస్త్ర చికిత్స చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. కణితి అంతకంతకు పెరుగుతండటంతో పడుకోవడానికి సైతం ఇబ్బంది పడుతుండేవాడు. తెలిసిన వ్యక్తుల ద్వారా ఇటీవల అమీర్‌పేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన పెంటయ్యను వైద్య బృందం అన్ని రకాల పరీక్షలు నిర్వహించి మంగళవారం శస్త్రచికిత్స చేసి 3 కిలోల బరువు ఉన్న కణితిని తొలగించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడని, ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని డాక్టర్ రహూఫ్ తెలిపారు.

సాంకేతిక అభివృద్ధికి ఆద్యుడు రాజీవ్‌గాంధీ



లాలాపేట: భారతదేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆద్యుడు మాజీ ప్రధాని దివంగత నేత రాజీవ్‌గాంధీ అని పలువురు కాంగ్రెస్ నేతలు కొనియాడారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం వడ్డెర బస్తీ కమాన్ వద్ద ఉన్న రాజీవ్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. ప్రధానిగా దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. లాజరస్, శ్రీనివాస్, లింగయ్య, వెంకటేష్, నర్సింహా, కుమార్, రవి, నరేష్, అశోక్ పాల్గొన్నారు.

- కంటోన్మెంట్ కాకగూడలో పీసీసీ సెక్రటరీ అయూబ్‌ఖాన్, సీనియర్ నాయకులు సంజీవరెడ్డి, రాజేష్ యాదవ్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ ప్రధానిగా దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు.

మహిళ అదృశ్యం



ఛాయా పల్లాడ్

రసూల్‌పురా: ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన కార్ఖాన పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పల్లవి మోడల్ స్కూల్ సమీపంలోని ఆరావెల్లి ఎన్‌క్లేవ్‌లో నివాసముంటున్న ఎం.ఎస్ ఛాయా పల్లాడ్ (48) ఈ నెల14న ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

బైక్‌పైనుంచి పడి మహిళ మృతి

రాంగోపాల్‌పేట్: స్పీడ్ బ్రేకర్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన సెక్రటరియేట్ (లేక్) పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం రసూల్‌పురాకు చెందిన ఫాతిమా, ఫయాజ్‌లు దంపతులు. వీరికి నలుగురు సంతానం. ఇద్దరు పిల్లలతో కలిసి బైక్‌పై నెక్లెస్ రోడ్డుకు వచ్చారు. తిరిగి వెళ్లే సమయంలో స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ ఎగరడంతో వెనుక కూర్చున్న ఫాతిమా కిందపడింది. తీవ్ర గాయాలపాలైన ఆమెను వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో పుంజుకున్న వేగం

- రాజీవ్ రహదారిలో మార్కింగ్‌లు మొదలు
- ఆందోళనలో బాధితులు
- పరిహారంపై తేల్చాలంటూ డిమాండ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణ ప్రక్రియలో వేగం పుంజుకుంది. రాజీవ్ రహదారి, నేషనల్ హైవే–44 మార్గాల్లో చేపట్టనున్న రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి మార్చి నెలలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కారణంగా పనులు మందకొడిగా సాగాయి. తాజాగా ఎన్నికలు ముగియడంతో అధికారులు పనుల్లో వేగం పెంచారు. ప్యారడైజ్ చౌరస్తా నుంచి సుచిత్ర వరకు 5.3 కిలోమీటర్లు, ప్యాట్నీ చౌరస్తా నుంచి హకీంపేట వరకు 18.10 కిలోమీటర్ల మేర రెండు ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించనున్నారు.

నెలాఖరు వరకు మార్కింగ్ పనులు పూర్తి..

రూ.3,902 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులకు సంబంధించి రక్షణ భూముల కేటాయింపునకు కేంద్రం ఇటీవలే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా నిర్మాణ పనులు చేపడుతోంది. 2016లోనే ఈ ప్రాజెక్టులకు సంబంధించి కేంద్రం సూత్రప్రాయ అంగీకారం తెలుపగా, అప్పట్లోనే మార్కింగ్ పనులు చేపట్టారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ప్రాజెక్టు అటకెక్కింది. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ప్రాజెక్టు పనుల్లో కదలిక వచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన భారీ రోడ్డు ప్రాజెక్టు ఇదే కావడం గమనార్హం. ఈ నెలాఖరు వరకు మార్కింగ్ పనులు పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది.

పరిహారంపై టెన్షన్..

రెండు మార్గాల్లో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి మొత్తం 321 ఎకరాల స్థలం సేకరిస్తున్నారు. ఇందులో 169 ఎకరాలు డిఫెన్స్ ల్యాండ్ కాగా, 92 ఎకరాలు ప్రైవేటు స్థలం ఉంది. ఇందులోనూ రాజీవ్ రహదారి మార్గంలోనే 83 ఎకరాల ప్రైవేటు స్థలం సేకరించాల్సి ఉంది. మొత్తం 200 అడుగుల మేరకు రోడ్డు విస్తరించనుండంతో ప్యాట్నీ నుంచి హకీంపేట మార్గంలో పెద్ద సంఖ్యలో వ్యాపార కేంద్రాలు మూతపడే ప్రమాదం ఏర్పడింది. దీంతో ఆయా భవనాలు యజమానులు ప్రైవేటు స్థలాలు ఉన్న ప్రాంతాల్లో విస్తరణను కుదించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఓ కాంప్లెక్స్ సెల్లార్ వద్ద ..



రాజీవ్ రహదారి మార్గంలో రోడ్డు విస్తరణకు వేసిన మార్కింగ్

ముఖ్యమంత్రికి లేఖలు..

ఇదే విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు అధికారులకు లేఖలు రాయడంతో పాటు పరిహారం విషయంలోనూ స్పష్టత ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారు. రక్షణ భూముల సేకరణకు ప్రత్యేక నిధులు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేటు స్థలాల విషయంలో మాత్రం ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. మార్కెట్ విలువకు అనుగుణంగా పరిహారం ఇవ్వడంతో పాటు, మిగిలిన స్థలంలో భవన నిర్మాణ నిబంధనల్లో సడలింపులు ఇవ్వాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు బాధితులు పేర్కొంటున్నారు. తాజాగా సోమవారం నుంచి మార్కింగ్ పనులు మొదలు కావడంతో మరోసారి ప్రభుత్వ పెద్దలను కలవాలని నిర్ణయించుకున్నారు.